## జనగాం గ్రామానికి బస్సు సర్వీస్ పునరుద్ధరణ



పెద్దేముల్, జనవరి 9 : మండల పరిధిలోని జనగాం గ్రామానికి బస్సు సర్వీస్ ప్రారంభించాలని బుధవారం విద్యార్థులు మంబాపూర్ ప్రధాన రహదారిపై ధర్నా చేయడంతో స్పందించిన ఆర్టీసీ అధికారులు గురువారం ఉదయం గ్రామానికి బస్సు సర్వీసును ప్రారంభించారు. దీంతో విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు , గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ బస్సు పునరుద్ధరించడానికి సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

## బస్సుల సరైన నిర్వహణతోనే సురక్షిత ప్రయాణం



మెకానిక్‌లు, ఉద్యోగులను సన్మానించిన డిపో మేనేజర్ కరుణశ్రీ, ఎస్ఐలు

పరిగి, జనవరి 9 : ఆర్టీసీ బస్సుల సరైన నిర్వహణతోనే సురక్షిత ప్రయాణం సాధ్యమని ఆర్టీసీ పరిగి డిపో మేనేజర్ కరుణ శ్రీ, పరిగి, కులకచర్ల ఎస్ఐ సంతోష్‌కుమార్, అన్వేష్ పేర్కొన్నారు. మెయింటెనెన్స్ డే సందర్భంగా గురువారం పరిగిలోని ఆర్టీసీ డిపోలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందజేసిన మెకానిక్‌లు ఖలీంపాషా, ఎం.డి.ముజీబ్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సాయిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు బస్సులను సరైన విధంగా మెయింటెనెన్స్ చేయడం సైతం ఆర్టీసీ అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. బస్సు సరైన విధంగా నడవాలంటే నిర్వహణ సక్రమంగా ఉండాల్సిందేనన్నారు. బస్సును పూర్తిస్థాయిలో కండిషన్‌లో ఉంచడం ద్వారా మైలేజీ పెరుగుతుందని, టైర్ల అరుగుదల తక్కువగా ఉంటుందన్నారు. డ్రైవర్లు సైతం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బస్సులు నడిపించాలని, ఓవర్‌టేక్ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు ఎంతో అవసరమని చెప్పారు. సంస్థలోని అన్ని విభాగాల ఉద్యోగుల సమిష్టి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి సాధ్యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సోమ్లనాయక్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## వృద్ధుడి డిజిటల్ అరెస్ట్.. రూ.20 లక్షలు అపహరణ

సిటీబ్యూరో, జనవరి 9(నమస్తే తెలంగాణ): మీకు వచ్చిన పార్సిల్‌లో ఐదు పాస్‌పోర్టు, 140 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ ఉందని, ఈ పార్సిల్ తిరస్కరించామని ఇంటర్నేషనల్ డీహెచ్ఎల్ ఎక్స్‌ప్రెస్ కొరియర్ నుంచి మాట్లాడుతున్నామంటూ సైబర్‌నేరగాళ్లు ఓ వృద్ధుడిని డిజిటల్ అరెస్ట్ చేసి రూ.20లక్షలు కాజేశారు. తనకు ఆ పార్సిల్‌తో సంబంధం లేదంటూ బాధితుడు చెప్పగా.. మేం ఈ విషయాన్ని ఢిల్లీ సైబర్‌సెల్‌కు కనెక్ట్ చేస్తున్నామని వాళ్లతో మాట్లాడుకోవాలని సూచించారు. అనంతరం పోలీసులమంటూ నమ్మిస్తూ సైబర్‌నేరగాళ్లు బాధితుడితో మాట్లాడారు. మీ ఆధార్‌కార్డును ఉపయోగించి నేరగాళ్లు నాలుగు బ్యాంకు ఖాతాలు తెరిచారంటూ చెప్పారు, మిమ్మల్ని విచారించాల్సి ఉందంటూ వీడియో కాల్‌లో మాట్లాడారు. మేం మాట్లాడేది చాలా సీక్రెట్‌గా ఉండాలని, లేదంటే మీ కుటుంబసభ్యులకు కూడా తెలియనీయకూడదంటూ చెప్పారు. ఆ తరువాత సైబర్‌నేరగాళ్లు సీబీఐ, ఆర్‌బీఐ లేఖలంటూ కొన్ని లెటర్లు వాట్సాప్‌లో పంపించారు. ఆ తరువాత మీరు కొంత డబ్బు చెల్లిస్తే అరెస్ట్ ఉండదని, లేదంటే అరెస్ట్ చేయాల్సి వస్తుందంటూ బెదిరించారు. మేం చెప్పే ఖాతాల్లోకి డబ్బు పంపిస్తే అవి ఆర్బీఐలో ఉన్నట్లేనని, మీ విచారణ పూర్తయిన తరువాత తిరిగి మీ డబ్బు మీకు వస్తుందంటూ నమ్మించారు. దీంతో భయంలో బాధితుడు సైబర్‌నేరగాళ్లు చెప్పినట్లు తన ఫిక్స్‌డ్ డిపాజిట్లు విత్‌డ్రా చేసి దఫదఫాలుగా రూ.20 లక్షలు సైబర్‌నేరగాళ్ల ఖాతాల్లో డిపాజిట్ చేశాడు. మరింత డబ్బు అడుగుతుండటంతో అనుమానం వచ్చిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

**ఉత్తర్వులు జారీ చేసిన రాచకొండ సీపీ**

సిటీబ్యూరో, జనవరి 9(నమస్తే తెలంగాణ): బహిరంగ ప్రదేశాల(పబ్లిక్ ప్లేస్)లో మద్యం సేవించడంపై నిషేధాజ్ఞలు విధిస్తూ రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 6 గంటల నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. పబ్లిక్ ప్లేస్‌లలో మద్యం సేవిస్తూ సాధారణ ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తున్నారని, అందులో ప్రత్యేకంగా మహిళలు, పిల్లలు ఉన్నారని వివరించారు. నిషేధాజ్ఞలు ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని, ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని సూచించారు.

## ధూల్‌పేటలో 2కిలోల గంజాయి పట్టివేత

**ముగ్గురి అరెస్ట్**



సిటీబ్యూరో, జనవరి 9(నమస్తే తెలంగాణ): గంజాయి విక్రయాలపై డేగ కన్ను పెట్టిన అబ్కారీ పోలీసులు ధూల్‌పేట, దాని పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ధూల్‌పేటకు చెందిన రాజేందర్‌సింగ్ ఇంటిపై దాడులు నిర్వహించగా.. 2.014కిలోల గంజాయి లభించింది. దీంతో నిందితుడు రాజేందర్‌సింగ్‌తో పాటు బ్రిజ్ విక్కీ, మెతోరి చెన్నయ్యలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్‌లు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా ఈ కేసుతో సంబంధం ఉన్న ఆకాష్‌సింగ్, దుర్గేశ్ సింగ్, వీరేశ్‌లపై సైతం కేసులు నమోదు చేశారు. ఎస్టీఎఫ్ ఈఎస్, ఆపరేషన్ ధూల్‌పేట్ ఇన్‌చార్జి నంద్యాల అంజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో ధూల్‌పేట సీఐలు మధుబాబు, గోపాల్, ఎస్ఐలు లలిత, సైదులు, హెడ్‌కానిస్టేబుళ్లు భాస్కర్‌రెడ్డి, అజీమ్, కానిస్టేబుళ్లు ప్రకాశ్, మహేశ్, రాకేశ్, సతీశ్, ఖలీల్ తదితరులు ఉన్నారు.

# దత్తత గ్రామాల అభివృద్ధికి కృషి

- సామాజిక సేవలో సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ
- రూ. కోటి ఆరు లక్షలతో పలు అభివృద్ధి పనులు
- వ్యవసాయానికి సైతం చేయూత
- గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు

పూడూరు, జనవరి 9 : సామాజిక సేవా కార్యక్రమంలో సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ (ఆశ స్వచ్ఛంద సంస్థ) రూ. కోటి ఆరు లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. పూడూరు మండల పరిధిలోని సిరిగాయపల్లి, దేవనోనిగూడెం, సోమన్‌గుర్తి గ్రామాలను 2019లో ఈ సంస్థ వారు దత్తత తీసుకున్నారు. ఈ గ్రామాల అభివృద్ధితో పాటు రైతులను సంఘటితం చేసి వారికి కావాల్సిన వ్యవసాయ పనిముట్లను అందజేసి పంటల అధిక దిగుబడికి కృషి చేస్తున్నారు. గ్రామంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో వైద్యశిబిరం నిర్వహించి ఉచితంగా మందులు, వృద్ధులకు కంటి అద్దాలను అందజేశారు. గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం అందజేసే నిధులకు తోడు గా వారి సంస్థ నుంచి సోమన్‌గుర్తికి రూ.45లక్షలు,సిరిగాయపల్లికి రూ. 44 లక్షలు, దేవనోనిగూడ రూ.7లక్షలపై నిధులతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లు, అంగన్‌వాడీ, నూతన పాఠశాల భవనంతో పాటు విద్యార్థులకు బెంచీలు, బ్లాక్‌బోర్డు, దేశ నాయకుల చిత్రపటాలు, మౌళిక వసతులు కల్పించారు. సిరిగాయపల్లి గ్రామంలోని రైతు సంఘంలో ఉన్న 60 మంది రైతులకు ఆర్థిక భారం తగ్గేలా ఉచితంగా ఎరువులను అందజేశారు. రైతులు పంట సాగుకు కూలీల కొరతతో ఇబ్బందులు పడకుండా సంఘం సభ్యులకు ఆరు మల్టీ వీడర్లను (వ్యవసాయ పంట పొలంలో కలుపు తొలగించే పరికరాలు) పంపిణీ చేశారు. గ్రామం నుంచి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న పెద్ద ఉమ్మెంతల్ హై స్కూల్‌కు వెళ్లే విద్యార్థినులకు సంస్థ నుండి ఉచితంగా సైకిళ్లను అందజేశారు. సంస్థ ద్వారా వెనుకబడిన గ్రామాల అభివృద్ధి చెందేలా తమ వంతు కృషి చేయాలన్న సంకల్పంతో ఈ గ్రామాలను ఎంపిక చేసుకొని మౌళిక వసతులు కల్పించి ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామాలలో చేస్తున్న అభివృద్ధి పనులతో ఇరుగ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



సంస్థ నుంచి రైతులకు వ్యవసాయ యంత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి (ఫైల్)



శిరిగాయపల్లిలో ఉచిత వైద్యశిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

### పేద రైతులకు మేలు..



ఐదు సంవత్సరాలుగా సంస్థ ద్వారా గ్రామంల్లో రూ.కోటికిపై నిధులతో అభివృద్ధిపనులు చేశారు. వైద్యశిబిరం, సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణంతో పాటు రైతు సంఘం ఏర్పాటు చేశారు. సంఘంలో ఉన్న రైతులకు ఉచితంగా వ్యవసాయ యంత్రాలు, ఎరువుల అందజేయడంతో పేద రైతులకు మేలు జరిగింది. సంస్థ గ్రామాన్ని దత్తత తీసుకొని పలు అభివృద్ధిపనులు చేయడం అభినందనీయం. గతంలో అందజేసిన ప్రభుత్వ నిధులతో పాటు సంస్థ వారి నిధులతో గ్రామాల్లో పలు సమస్యలు పరిష్కారమైయ్యాయి.

-సీతారాంరెడ్డి, రైతు సిరిగాయపల్లి

### పాఠశాలలో మౌళిక వసతులు ..



సంస్థతో ప్రాథమిక, ఉన్న పాఠశాలలో పలు అభివృద్ధి పనులు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సరైన తరగతి గదులు లేక పోవడంతో సంస్థ నుంచి రూ.5లక్షలు అందజేసి నూతన గది నిర్మాణానికి సహకరించారు. హై స్కూల్ విద్యార్థులకు పలు మౌళిక వసతులు కల్పించారు. సిరిగాయపల్లి, సోమన్‌గుర్తి, దేవనోనిగూడ గ్రామాలను ఎంపిక చేసుకొని డ్రైనేజీలతో పాటు పాఠశాల అభివృద్ధి కృషి చేస్తున్న సైబేజ్ సంస్థ వారికి గ్రామం తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

-యు.బుచ్చన్న, మాజీ సర్పంచ్, దేవనోనిగూడెం

## బైక్‌ను ఢీకొన్న లారీ.. ఒకరి మృతి

కొడంగల్, జనవరి 9: బైక్‌ను లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన పట్టణ కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ సత్యనారాయణ అందించిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్ కాలనీలో బుగ్గప్ప (48) నివాసం ఉంటున్నాడు. పని నిమిత్తం బైక్‌పై ఇంటి నుంచి బయలు దేరగా, లాహోటీ కమాన్ ప్రాంతంలో మళ్లే క్రమంలో కర్ణాటక నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. దాంతో బుగ్గప్ప అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య శేఖరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

మర్పల్లి, జనవరి 9: మండల కేంద్రంలో చాకలి శ్రీనివాస్ బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి గురువారం శ్రీనివాస్ అంత్య క్రియల కోసం రూ.5 వేలు పంపగా స్థానిక మాజీ వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి, బీఆర్ ఎస్ టౌన్ ప్రెసిడెంట్ గఫార్, ఖాజా, మిత్ర, నవీన్ గ్రామస్తులతో కలిసి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు ను అందజేశారు.

**ధారూరు:** మండల కేంద్రానికి చెందిన తలారి సంగయ్య కుమారుడు తలారి ప్రభాకర్ అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం చెన్నుస్వామి ఫౌండేషన్ సభ్యులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.ఐదువేలు అందజేశారు.

## సెంట్రింగ్ కుప్పకూలి ఏడుగురు కార్మికులకు గాయాలు

బండ్లగూడ, జనవరి 9: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బండ్లగూడలో నిర్మాణంలో ఉన్న ఓ భవనం స్లాబ్‌కు సెంట్రింగ్ కొడుతుండగా.. సెంట్రింగ్ ఒక్కసారిగా కుప్ప కూలింది. దీంతో ఏడుగురు కార్మికులకు తీవ్రగాయాలు అయ్యాయి. వివరాలలోకి వెళితే.. బండ్లగూడ ప్రాంతంలో ఓ నిర్మాణ సంస్థ భవన నిర్మాణ పనులను చేపడుతున్నది. పై అంతస్తులో కార్మికులు సెంట్రింగ్ పనులను చేపడుతుండగా.. ఆకస్మాత్తుగా సెంట్రింగ్ కుప్ప కూలింది. పని చేస్తున్న ఏడుగురు కార్మికులపై సెంట్రింగ్ కుప్ప కూలడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు, తోటి కార్మికులు బయటకు తీసి స్థానిక దవాఖానకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. భవన నిర్మాణ సంస్థ జాగ్రత్తలు పాటించకుండా నిర్మాణాలను చేపట్టడం వల్ల ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బండ్లగూడ జాగీర్ మేయర్ లతాప్రేమ్ గౌడ్ ప్రమాదం జరిగిన స్థలాన్ని సందర్శించడంతోపాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



వికారాబాద్, జనవరి 9 : పీఆర్‌టీయూ తెలంగాణ సంఘం క్యాలెండర్, డైరీని గురువారం వికారాబాద్ డీఈవో కార్యాలయంలో డీఈవో రేణుకాదేవి ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యం చెన్నయ్య , వికారాబాద్ జిల్లా అధ్యక్షులు విజయ, శ్రావణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి మల్లేశం పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



వికారాబాద్, జనవరి 9 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మోమిన్‌పేట ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. గురువారం మోమిన్‌పేట మండలంలోని కేజీబీవీ పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లయ్య, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## డ్రైవింగ్ రూల్స్.. తల్లిదండ్రులకు చెప్పండి

**విద్యార్థులకు ఆర్టీఏ అధికారుల ట్రాఫిక్ పాఠాలు**



సిటీబ్యూరో, జనవరి 9(నమస్తే తెలంగాణ): చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఆర్టీఓ కిష్టయ్య తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఉన్నతాధికారుల సూచనలతో ఆర్టీఓలు తమ పరిధిలోని పాఠశాలలు, కాలేజీలు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్ల వద్ద రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా గురువారం అంబర్‌పేటలోని ప్రభుత్వ పాఠశాలలో మలక్‌పేట ఆర్టీఏ అధికారుల ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు ఎలా జరుగుతాయి? డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ట్రాఫిక్ రూల్స్ ఎలా పాటించాలి? తదితర విషయాలన్నింటిపై అవగాహన కల్పించారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రాణాల మీదకు తెచ్చుకోకూడదని అధికారులు వివరించారు. అమ్మానాన్నలకు డ్రైవింగ్ రూల్స్ పాటించాలని చెప్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ ఆర్.రమేశ్‌బాబు, ఏఎంవీఐ మధుసూదన్ రెడ్డి, జాన్, అశ్రఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



కులకచర్ల, జనవరి 9: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో వసతులను పరిశీలించారు. అనంతరం భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. పెంచిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ఎస్‌వో దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలి




టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు, ఎంఈవో

కులకచర్ల, జనవరి 9 : ప్రభుత్వం పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, మండల అధ్యక్షుడు ఉప్పరి రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు రాక ఉద్యోగ ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో అబీబ్‌హైమద్ జీహెచ్ఎం శరత్‌కృష్ణ, పుట్టపహాడ్ ప్రధానోపా ధ్యాయులు అజ్మతుల్లా, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ అదృశ్యం

**-కేసు నమోదు**

హయత్‌నగర్, జనవరి 9: ఆర్టీసీ డ్రైవర్ అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. హయత్‌నగర్‌లోని వీరభద్ర కాలనీకి చెందిన పెరుమడ్ల రాజేశ్వర్(41), వృత్తిరీత్యా ముషీరాబాద్ డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 14న ఉదయం 11.30 గంటలకు డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తున్నది. దీంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు, అతడి ఆచూకీ కోసం చుట్టుపక్కలతోపాటు బంధువుల వద్ద వెతికినా ఫలితం దక్కలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**PUBLIC NOTICE**

General public is hereby, informed that my client Gangyada Nagesh, S/o. Late Rajaiah, R/o. H.No. 1-28/3, Kanakamamidi Village, Moinabad Mandal, R.R.District, lost original Sale deed vide document No. 3738 of 2015, dated 23-06-2015, registered at SRO, Chevella, pertaining to the House bearing No. 1-28/3 constructed over Plot No. 7 admeasuring 300 Sq. Yards, in Sy.No. 359, situated at Kanakamamidi Village, Moinabad Mandal, R.R.District. The above document was lost by my client while carrying the same to take xerox of the said document at Moinabad on 01-01-2025 at 03:15 PM. If anyone has found the above said document please return to my client or to my below mentioned address.

Sd/- **A. SRIDHAR**
Advocate
Union bank Building, 1st floor,
P.S.Complex, Moinabad, R.R.
District-501504. **Cell No: 8977793417**

## తమాషాలు చేస్తున్నారా? కబ్జాలకు సహకరిస్తారా..!

సిటీబ్యూరో/శంషాబాద్‌రూరల్, జనవరి 9(నమస్తే తెలంగాణ): శంషాబాద్‌లో చెరువులపై హైడ్రా ఫోకస్ పెట్టింది. గురువారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చారినగర్‌లో ఉన్న గొల్లవానికుంట, ధర్మోజి కుంటలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి సందర్శించారు. సర్వే నంబర్ 73లో 10.12ఎకరాల గుంటల విస్తీర్ణంలో ధర్మోజి కుంట, సర్వే నంబర్104లో 22ఎకరాల 23 గుంటల విస్తీర్ణంలో గొల్లవాని కుంట ఉండాలి.. కానీ ఈ చెరువుల్లో 75శాతం లేకుండా పోయిందని, దీనికి ఎవరూ కారణమంటూ ఇరిగేషన్ అధికారులను రంగనాథ్ ప్రశ్నించారు. ఈ కుంటలలో కొందరు మట్టిని నింపి ఆక్రమణలు చేశారంటూ హైడ్రా కార్యాలయానికి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా బృందం ధర్మోజి కుంట ప్రాంతంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో భారీ నిర్మాణాలు జరిగాయని, ప్రహరీ కుంట పరిధిలోకి రాదని ఇరిగేషన్ అధికారులు మొదలు చెప్పి తర్వాత రికార్డులు పరిశీలించడంతో బఫర్‌లోకి వస్తుందంటూ చెప్పడంతో రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మోజికుంటను పూడ్చివేస్తూ నిర్మాణం చేస్తున్నది ఎవరంటూ కమిషనర్ అధికారులను అడగగా కాంగ్రెస్ ఎమ్మెల్యే బంధువులంటూ వారు బదులిచ్చారు. బఫర్ జోన్‌లో ప్రహరీ నిర్మించిన వ్యక్తికి నోటీసులివ్వాలని, రెండురోజుల్లో సొంతంగా కూల్చివేయకపోతే ఆ తర్వాత హైడ్రా కూల్చివేతలు తప్పవని, దీంతోపాటు చెరువులో వేసిన మట్టిని కూడాఎత్తివేయించాలని సూచించారు. మరోవైపు కబ్జాదారుతో కుమ్మక్కై కాదు.. కూడదు అంటూ కాలం గడుపుతూ సమస్యను పక్కదోవ పట్టిస్తే ఇరిగేషన్ అధికారులపై కేసులు నమోదు చేస్తామంటూ హెచ్చరించారు. ధర్మోజికుంట, గొల్లవాని కుంట చెరువును కనుమరుగు చేస్తూ ప్లాట్లు చేసి అమ్ముకున్నది ఎవరంటూ స్థానిక అధికారులను రంగనాథ్ ప్రశ్నించారు. మున్సిపల్‌చైర్‌పర్సన్ భర్త మహేందర్‌రెడ్డిని చూపిస్తూ ఇతనే అమ్ముకున్నారని అధికారులు చెప్పగా కమిషనర్ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువుల కబ్జాకు కారణమైన వారితో పాటు వారికి సహకరించిన అధికారులపై కూడా చర్యలు తప్పవంటూ ఇరి గేషన్, రెవెన్యూ అధికారులను హెచ్చరించారు.

**మణికొండ:** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ గ్రామ చిన్న, పెద్ద చెరువులను గురువారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ తన బృందంతో కలిసి పరిశీలించారు.



ధర్మోజికుంటను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962

**బహిరంగ ప్రకటన**

సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ ఆర్.ఆర్.జిల్లా, మహేశ్వరం మండలం, సుభాన్‌పూర్ గ్రామం వద్ద గల సర్వే నెం. 38/A3/1 విస్తీర్ణం ఎ. 3-19 గుంటలు, సర్వే నెం. 38/A3/2 విస్తీర్ణం ఎ. 3-20 గుంటలు, మొత్తం విస్తీర్ణం ఎ. 6-39 గుంటల వ్యవసాయ భూములు, **సరిహద్దులు: ఉత్తరం:** సుభాన్‌పూర్ నుండి పెంజర్లకు రోడ్, **దక్షిణం:** మై హోమ్స్‌కు చెందిన భూమి, **తూర్పు:** పొరుగువారి భూమి, **పడమర:** పొరుగువారి భూమి వంటి హద్దులుగల వ్యవసాయ భూములను దాని చట్టబద్ధమైన యజమానులు మరియు స్వాధీనదారులు **శ్రీ బాసాని ఆరోగ్యరెడ్డి,** తండ్రి: ఇన్నారెడ్డి మరియు **శ్రీ బాసాని మర్‌రెడ్డి,** తండ్రి: ఇన్నారెడ్డి వారి నుండి కొనుగోలు చేయాలని ఉద్దేశిస్తున్నారు మరియు నా క్లయింట్ భూమి యజమానికి టోకెన్ అడ్వాన్స్ చెల్లించారు మరియు అతని పేరున రిజిస్టర్డ్ సేల్‌డీడ్ పొందుటకు ఉద్దేశిస్తున్నారు మరియు ఎవరైనా పై సదరు భూమిపై ఏదేని క్లెయిమ్, హక్కు, టైటిల్, ప్రయోజనం లేదా స్వాధీనత కలిగి ఉన్నచో, ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి (7) రోజులలోగా దిగువ సంతకందారుకు సంబంధిత డాక్యుమెంటరీ రుజువుతో వారి అభ్యంతరాలను దాఖలు చేయవలెను. లేనిచో, అమ్మకం లావాదేవీని పూర్తి చేస్తారు మరియు ఆతరువాత ఎలాంటి అభ్యంతరాలు పరిగణించబడవు.

**సం/- డి. సంగప్ప, B.Sc., LL.B, అడ్వకేట్**
ఫ్లాట్ నెం. 103, శ్రీ వెంకట సాయి నిలయం,
ప్లాట్ నెం. 149, స్నేహిత హిల్స్, ఫేజ్-I,
పీరంచెరు, PBEL సిటీ దగ్గర,
బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్,
గండిపేట మండలం, ఆర్.ఆర్.జిల్లా-500 086, TS,
ఇ-మెయిల్: sangappa5979@gmail.com,
**సెల్: 9666135775.**
తేది: 09-01-2025